క్లుప్తంగా

విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఎల్లారెడ్డిపేట: మండలకేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సెస్ ఏఈఈ పృథ్వీధర్ గౌడ్ శనివారం తెలిపారు. ఉదయం 7గంటల నుంచి మధ్యాహ్నం 1గంటవరకు ఎల్లారెడ్డిపేట, దుమాల గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. ఇందుకు రైతులు, వినియోగదారులు సహకరించాలని కోరారు.

నేడు ప్రవేశ పరీక్ష

ఇల్లంతకుంట: మండలంలోని రహీంఖాన్‌పేట ఆదర్శపాఠశాలలో ఆదివారం ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు ఆరో తరగతిలో ప్రవేశం కోసం పరీక్ష నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ గంగాధర్ తెలిపారు. 7వ తరగతి నుంచి పదో తరగతి ప్రవేశానికి మధ్యాహ్నం 2గంటల నుంచి 4 గంటల వరకు ప్రవేశపరీక్ష జరుగుతుందన్నారు. విద్యార్థులు ముందే పరీక్షాకేంద్రానికి చేరుకోవాలని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు.

29న 'భూభారతి'పై అవగాహన

వీర్నపల్లి: మండలకేంద్రంలోని రైతువేదికలో ఈనెల 29న భూభారతిపై అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ ముక్తార్ పాషా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 2 గంటలకు జరిగే ఈ కార్యక్రమానికి రైతులు హాజరుకావాలని కోరారు.

కొనసాగుతున్న ఇంటర్వ్యూలు


ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న అధికారులు

తంగళ్లపల్లి: ప్రభుత్వం ప్రవేశపెట్టిన రాజీవ్ యువ వికాసం కింద దరఖాస్తు చేసుకున్న వారికి శనివారం ఇంటర్వ్యూలు కొనసాగాయి. కార్యక్రమంలో ఎంపీడీవో లక్ష్మీనారాయణ తెలిపారు. సూపరింటెండెంట్ రమేశ్, బ్యాంకు అధికారులు పాల్గొన్నారు.

భూ భారతిని సద్వినియోగం చేసుకోవాలి


నారాయణపూర్‌లో ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పిస్తున్న కళాకారులు

ఎల్లారెడ్డిపేట: ప్రభుత్వం ప్రవేశపెట్టిన భూ భారతి పోర్టల్‌ను అందరూ సద్వినియోగం చేసుకొని భూ సమస్యలు పరిష్కరించుకోవాలని తెలంగాణ సాంస్కృతిక సారథి టీం లీడర్ గడ్డం శ్రీనివాస్ కోరారు. మండలంలోని నారాయణపూర్‌లో శనివారం ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజలకు కళాకారులు ఆటపాటలతో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ..ప్రతిఒక్కరూ చెట్లను పెంచే బాధ్యత తీసుకోవాలన్నారు. ప్లాస్టిక్ రహిత సమాజం కోసం కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో కళాకారులు శ్రీరాముల రామచంద్రం, ఎడ్మల శ్రీధర్ రెడ్డి, గుగ్గిల్ల పర్శరాములు, వంతడుపుల గణేష్, గ్రామస్తులు పాల్గొన్నారు.

సౌకర్యాలు కల్పించాలి

బోయినపల్లి: రైస్ మిల్లుల్లో కనీస సౌకర్యాలు లేక మిల్లులకు ధాన్యం తీసుకువచ్చే డ్రైవర్లతో పాటు పలువురు అవస్థలు పడుతున్నారని సీపీఎం మండల కన్వీనర్ గురజాల శ్రీధర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలనుంచి రైస్ మిల్లులకు ధాన్యం తరలించే లారీ డ్రైవర్లు అక్కడ ఎలాంటి సౌకర్యాలు లేక ఎండలో ఉంటున్నారన్నారు. రైస్ మిల్లుల వారు లారీ డ్రైవర్లు విశ్రాంతి తీసుకునేందుకు గది సౌకర్యం కల్పించాలని కోరారు.

రైస్‌మిల్లు వ్యర్థాలు సేకరణ


గొల్లపల్లిలో రైస్‌మిల్లు వద్ద వ్యర్థాలను సేకరిస్తున్న అధికారులు

ఎల్లారెడ్డిపేట: మండలంలోని రాచర్లగొల్లపల్లిలోని రాజరాజేశ్వర ఇండస్ట్రియల్ పారాబాయిల్డ్ రైస్‌మిల్లు నుంచి కాలుష్య నియంత్రణ మండలి బోర్డు అధికారులు శనివారం వ్యర్థ పదార్థాలను సేకరించారు. రైస్‌మిల్లు నుంచి బయటకు వ్యర్థాలు వచ్చి పంటలు దెబ్బతింటున్నాయని సమీప రైతులు మండలి అధికారులకు ఫిర్యాదు చేశారు. అధికారులు క్షేత్రస్థాయిలో వ్యర్థాలను పరిశీలించి తొలగించారు. మండలి బోర్డు అసిస్టెంట్ ప్రొఫెసర్ జ్యోతి మాట్లాడుతూ.. వ్యర్థాలను పంట పొలాల్లోకి వదిలితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతులు తిరుపతి, శ్రీనివాస్, శ్రీశైలం ఉన్నారు.







జ్యూస్.. జోష్

- తాపం తీరుస్తున్న పండ్ల రసాలు
- కిటకిటలాడుతున్న జ్యూస్‌సెంటర్లు
- చిరు వ్యాపారులకు సమ్మర్ ఉపాధి
- సిరిసిల్లలో విరివిగా పండ్లరసాల అమ్మకాలు

సిరిసిల్లటౌన్: ఫ్రూట్ జ్యూస్ జనాల్లో జోష్ నింపుతున్నాయి. మండుటెండల నుంచి ఉపశమనాన్ని అందిస్తున్నాయి. ముదురుతున్న ఎండలకు, రోజురోజుకు పెరుగుతున్న వేడిమికి జనాలు ఉక్కిరిబిక్కిరితో అల్లాడుతున్నారు. నీరు సేవించినా కొద్దీ తడారుతున్న నోటికి ఉపశమనం కోసం పండ్ల రసాలను కోరుతున్నారు. జనాల అభిరుచికి తగ్గట్టు తయారు చేసిన తాజాపండ్ల రసాలు నోరూరిస్తున్నాయి. సమ్మర్ స్పెషల్ బిజినెస్‌తో చిరువ్యాపారులకు చల్లని ఉపాధి లభిస్తోంది. దీనిపై ఈవారం సండే స్పెషల్ కథనం..

పండ్ల రసమే..సో బెటర్

వేసవితాపం తీర్చుకునేందుకు కెమికల్స్, అర్టిఫిషియల్ ఫ్లేవర్స్‌తో లభించే చల్లని పానీయాలను కాదని ఆరోగ్యాన్నిచ్చే పండ్ల రసాలు(జ్యూస్‌లు) సేవిస్తున్నారు. సిరిసిల్లలో సాధారణ రోజుల్లో పదుల సంఖ్యలో ఉండే సెంటర్లు ఎండాకాలంలో వందకు పైగా వెలిశాయి. చాలా మంది సీజనల్ ఉపాధిగా ఈ వ్యాపారాన్ని ఎంచుకుంటున్నారు. నిత్యం ఒక్కో జ్యూస్ సెంటర్‌లో రూ.2వేల నుంచి రూ.12వేల వరకు వ్యాపారం జరుగుతోందంటే జ్యూస్‌లను ఎలా తాగుతున్నారో అర్థం చేసుకోవచ్చు. సిరిసిల్ల మొత్తంగా రోజుకు రూ.5లక్షల వరకు వ్యాపారం జరుగుతోందని తెలుస్తోంది. ఈ వ్యాపారం ఫిబ్రవరిలో మొదలై జూన్ వరకు జోరుగా కొనసాగనుంది.

వందస్టాల్స్.. 200 మందికి ఉపాధి

సిరిసిల్ల వ్యాప్తంగా దాదాపు వంద జ్యూస్‌సెంటర్లు వెలిశాయి. ప్రత్యక్షంగా..పరోక్షంగా సుమారు 200 మంది ఉపాధి పొందుతున్నారు. హైదరాబాద్, వరంగల్, విజయవాడ, మహారాష్ట్ర ప్రాంతాల నుంచి పండ్లను దిగుమతి చేసుకుంటున్నారు. ఎండల తీవ్రత పెరిగిపోవడంతో జ్యూస్ స్టాళ్లలో సందడి పెరిగింది. స్థానిక పాతబస్టాండ్, కొత్తచెరువు, అంబేడ్కర్‌చౌక్, గాంధీచౌక్, మార్కెట్ ఏరియా, కొత్త బస్టాండ్, గోపాల్‌నగర్, కలెక్టర్ కార్యలయ ప్రాంతాల్లో జ్యూస్‌స్టాళ్లు వెలిశాయి.

పండ్ల రసం ఆరోగ్యదాయకం



ఆరోగ్యానికి మేలు కలిగించే పండ్ల రసాలు తాగడమే మంచిది. అన్ని కాలాల్లో జ్యూస్‌లు తాగాలని వైద్యులు సైతం సూచిస్తున్నారు. కూల్‌డ్రింక్స్‌తో తాత్కాలిక ఉపశమనం కలిగినా ఆరోగ్యంపై ప్రభావం చూపుతాయి. ఆరోగ్యానికి ప్రాధాన్యతనిస్తూ సమ్మర్‌లో తాజా పండ్లరసాలు తాగుతాం. – మునిగొండ అశ్విన్, సిరిసిల్ల

తాజా జ్యూస్ ఇష్టపడతారు



ఎండలు తొందరగా ముదరడంతో పండ్ల రసాలు తాగడానికి కస్టమర్లు ఇష్టపడుతున్నారు. వేడిమి నుంచి తట్టుకునేందుకు కాఫీలు, చాయ్‌లు వద్దనుకుని ఫ్రెష్‌గా జ్యూస్‌లు తాగుతున్నారు. కస్టమర్లు కోరిన అన్నిరకాల పండ్లను దూర ప్రాంతాల నుంచి తెప్పిస్తున్నాం. తాజా పండ్ల రసాలు అందిస్తున్నాం. – సిద్దుల లావణ్య, జ్యూస్ సెంటర్ నిర్వాహకురాలు

జాతీయ వాదమా..తెలంగాణ వాదమా

- సిరిసిల్ల కాంగ్రెస్ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి


మాట్లాడుతున్న కేకే మహేందర్‌రెడ్డి

సిరిసిల్లటౌన్: ఉద్యమ పార్టీ అంటారు..జాతీయ రాజకీయాల్లో ఉంటామంటారు..ప్రజలు చీత్కరిస్తారు..అయినా నిస్సిగ్గుగా వ్యవహరిస్తారు అంటూ సిరిసిల్ల కాంగ్రెస్ ఇన్‌చార్జి కే.కే. మహేందర్‌రెడ్డి బీఆర్‌ఎస్ పార్టీపై ఘాటు వ్యాఖ్యలు చేశారు. సిరిసిల్లలోని తన నివాసంలో శనివారం ప్రెస్‌మీట్లో మాట్లాడారు. వరంగల్‌లో నిర్వహించే సభ భారత రాష్ట్ర సమితి వార్షికోత్సవ సభనా..టీఆర్‌ఎస్ రజతోత్సవ సభనో కేసీఆర్ ప్రజలకు స్పష్టం చేయాల్సిందేనన్నారు. గతంలో తెలంగాణ వాదులకు పట్టిన గతే బీఆర్‌ఎస్‌లో హరీశ్‌రావుకు పట్టబోతుందన్నారు. నీళ్లు, నిధులు, ఉద్యోగాల పేరుతో పదేళ్ల పాటు అధికారం చేపట్టి తెలంగాణ ప్రజలను వంచించిన కేసీఆర్ వరంగల్ సభాముఖంగా బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఏడాదిన్నర క్రితమే కేసీఆర్, ఆయన కొడుకు కేటీఆర్ మోసాలను ప్రజలు కాంగ్రెస్ పార్టీని గెలిపించి తిప్పికొట్టారని విమర్శించారు. బీఆర్‌ఎస్ సభకు స్వచ్ఛందంగా ఎవరూ పోవడం లేదని, అందరూ తరలిస్తున్న జనాలేనని ఎద్దేవా చేశారు. స్థానికంగా ఉండకుండా అన్నదాతలు, నేతకార్మికుల సమస్యలను ఎమ్మెల్యే కేటీఆర్ పూర్తిగా విస్మరిస్తున్నారన్నారు. కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాశ్, ఏఎంసీ చైర్మన్ వెల్ముల స్వరూపరెడ్డి, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు కాముని వనిత, వైద్య శివప్రసాద్, యెల్లె లక్ష్మీనారాయణ, కల్లూరి చందన, బైరినేని రాము, ప్రసాద్, కత్తెర దేవదాసు పాల్గొన్నారు.

ప్రైవేట్‌కు దీటుగా విద్యాబోధన


లింగంపల్లిలో బడిబాటలో పాల్గొన్న ఎంఈవో, ఉపాధ్యాయులు

వేములవాడరూరల్: వేములవాడ రూరల్ మండలం లింగంపల్లి గ్రామంలో శనివారం బడిబాట కార్యక్రమం నిర్వహించారు. బడీడు పిల్లల్ని బడిలో చేర్పించాలని ప్రచారం నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్న వసతుల గూర్చి వివరించారు. ప్రైవేట్‌కు దీటుగా నాణ్యమైన విద్యాబోధన అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంఈవో కిషన్, నాయకులు సామ తిరుపతిరెడ్డి, ఉపాధ్యాయులు, సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.



వేములవాడ : అమరవీరుల స్థూపం వద్ద కొవ్వొత్తులతో నివాళి అర్పిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు


ఎల్లారెడ్డిపేటలో ముస్లింల ర్యాలీ..


ఇల్లంతకుంట : పెద్ద లింగాపూర్‌లో


కోనరావుపేట: వట్టిమల్లలో ..

కొవ్వొత్తులతో నివాళి

పహల్గాం ఉగ్రదాడిని నిరసిస్తూ వేములవాడలోని అమరవీరుల స్థూపం వద్ద బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనర్సింహారావు ఆధ్వర్యంలో ఆపార్టీ నాయకులు శనివారం రాత్రి కొవ్వొత్తులతో నివాళి అర్పించారు. నాయకులు రామతీర్థపు రాజు, క్రాంతికుమార్, నిమ్మశెట్టి విజయ్, సిరిగిరి చందు, గోలి మహేశ్, శేఖర్, జోగిని శంకర్, గోస్కుల రవి తదితరులున్నారు. పట్టణంలో సీపీఐ ఆధ్వర్యంలో ఉగ్రవాదుల దిష్టిబొమ్మను దహనం చేశారు. కోనరావుపేట మండలం వట్టిమల్లలో యూత్ ఆధ్వర్యంలో ఉగ్రవాదుల దాడిలో మృతిచెందిన వారికి కొవ్వొత్తులతో నివాళి అర్పించారు. ఇక్కడ యూత్ సభ్యులు, గ్రామస్తులు ఉన్నారు. ఎల్లారెడ్డిపేటలో ముస్లింలు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించి నివాళి అర్పించారు. ఎల్లారెడ్డిపేట మజీద్ కమిటీ నేతలు హైమద్, గౌస్, చాంద్‌పాషా, షాదుల్లా, షాదుల్, షరీఫ్ తదితరులున్నారు. ఇల్లంతకుంట మండలం పెద్ద లింగాపూర్ గ్రామంలో అంబేడ్కర్ సంఘం సభ్యులు అంబేడ్కర్ చౌరస్తా వద్ద కొవ్వొత్తులతో నివాళి అర్పించారు. వెల్జిపూర్‌లో నాయకులు, గ్రామస్తులు కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు.

– వేములవాడ/వేములవాడ అర్బన్/కోనరావుపేట/ఎల్లారెడ్డిపేట/ఇల్లంతకుంట

అదనపు కట్నం కోసం వేధిస్తున్న వ్యక్తిపై కేసు

ఎల్లారెడ్డిపేట: అదనపు కట్నం కోసం వేధిస్తున్న ఓ వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై రమాకాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. అక్కపల్లికి చెందిన మేరీకి ఆరేళ్ల క్రితం బుగ్గరాజేశ్వరతండాకు చెందిన గుగులోత్ అనిల్‌తో వివాహమైంది. ఆ సమయంలో కట్న కానుకలు ఇచ్చి వివాహం జరిపించారు. అనంతరం రెండునెలల తర్వాత అదనపు కట్నం తేవాలని వేధించాడు. దీంతో మేరీ ఫిర్యాదు మేరకు గతంలో అనిల్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. తన భార్యను బాగా చూసుకుంటానని, కాపురానికి తీసుకెళ్లాడు. మళ్లీ కొద్ది రోజులుగా అదనపు కట్నంకోసం వేధిస్తుండగా ఈనెల 25న రాత్రి మేరీపై దాడిచేశాడు. బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయగా అనిల్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



ఎల్లారెడ్డిపేట: ఎల్లారెడ్డిపేట గ్రామ పంచాయతీ పరిధిలోని కిషన్‌దాస్‌పేటలో శ్రీ భక్తాంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. అర్చకులు గొంగ్లె ఉమాశంకర్ శర్మ ఆధ్వర్యంలో ఉదయం ఆలయంలో స్వామివారిని చందనంతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం హోమం కాల్చి స్వామివారికి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు అన్నదానం చేశారు. ఆలయానికి విరాళాలు అందించిన దాతలను సత్కరించారు. మాజీ జెడ్పీటీసీ చీటీ లక్ష్మణ్‌రావు, సింగిల్‌విండో చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి, సెస్ డైరెక్టర్ వరుస కృష్ణహరి, నాయకులు ఎనగందుల నర్సింలు, గుండాడి వెంకట్‌రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు మొక్కులు చెల్లించుకున్నారు.

వేములవాడ సమాచారం



వేములవాడ రాజన్న సన్నిధిలో శనివారం భక్తుల రద్దీ కొనసాగింది. సాయంత్రం 4 గంటల వరకు వసతి గదుల సమాచారం.

కాంప్లెక్స్ పేరు	ఖాళీల సంఖ్య	అద్దె రూ.
అమ్మవారి కాంప్లెక్స్	0	1,680
భీమేశ్వర సదన్ ఏసీ	0	1,344
భీమేశ్వర సదన్ సూట్స్	0	1,680
భీమేశ్వర గెస్ట్‌హౌస్	0	2,800
నందీశ్వర కాంప్లెక్స్ ఏసీ	0	1,008
నందీశ్వర నాన్‌ఏసీ	01	560
నందీశ్వర సూట్స్	0	2,800
లక్ష్మీగణపతి కాంప్లెక్స్	0	448
పార్వతీపురం స్పెషల్	0	672
పార్వతీపురం సాధారణ	0	336

- వేములవాడ



ఎల్లారెడ్డిపేట: మండలంలో ప్రధాన రహదారుల వెంట రైతులు ధాన్యం ఆరబోస్తున్నారు. ఐకేపీ అధికారులు అర్భాటంగా కొనుగోలు కేంద్రాలు ప్రారంభించినా రైతులు ధాన్యం ఆరబెట్టుకునేందుకు సరైన స్థలాలను ఏర్పాటు చేయలేదు. మండలంలోని అల్మాస్‌పూర్, కోరుట్లపేట, బండలింగంపల్లి, సింగారం రహదారుల్లో నిత్యం రైతులు రోడ్లపైనే ధాన్యం ఆరబోస్తుండటంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. పోలీసులు రైతులకు అవగాహన కల్పిస్తున్నా సరైన వసతులు లేక రోడ్లపైనే ధాన్యం ఆరబోయాల్సిన పరిస్థితి. అధికారులు వసతులు కల్పించాలని రైతులు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి :
మల్లేశం, ఐకేపీ, ఏపీఎం, ఎల్లారెడ్డిపేట: సెల్ నంబర్: 984964 3359

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9440243048, 9705346626

ఏటా లైసెన్స్‌లు రెన్యూవల్ చేసుకోవాలి

- జిల్లా మత్స్యశాఖ అధికారి సౌజన్య
- రుద్రవరంలో మత్స్యకారులకు అవగాహన


మాట్లాడుతున్న జిల్లా మత్స్యశాఖ అధికారి సౌజన్య

వేములవాడఅర్బన్: మిడ్‌మానేరు జలాశయంలో చేపలు పట్టే వారు ఏటా సెప్టెంబర్ నెలలో రెన్యూవల్ చేసుకోవాలని జిల్లా మత్స్యశాఖ అధికారి సౌజన్య కోరారు. వేములవాడ మండలం రుద్రవరం గ్రామంలో శనివారం నిర్వహించిన అవగాహన సదస్సులో మాట్లాడారు. మధ్యమానేరు జలాశయ పరిధిలోని లైసెన్స్‌దారులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరిస్తామన్నారు. మత్స్యకారులు మాట్లాడుతూ లైసెన్స్‌దారులకు తెప్పలు, వలలను సబ్సిడీపై ఇవ్వాలని కోరారు. మధ్యమానేరులో 10 టీఎంసీల వరకు నీరు ఉన్న రోజుల్లోనే నిర్వాసిత గ్రామ ప్రజలు చేపలుపట్టుకునే అవకాశం ఇవ్వాలని లైసెన్స్‌దారులు విన్నవించారు. చొప్పరి రామచంద్రం తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుల పాదయాత్ర


పదిరలో పాదయాత్ర చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఎల్లారెడ్డిపేట: ఓ వైపు సంక్షేమ పథకాలు అమలు చేస్తూనే.. మరో వైపు అభివృద్ధిలో ముందుకెళ్తున్నట్లు జిల్లా కిసాన్‌సెల్ అధ్యక్షుడు కేతిరి జగన్మోహన్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య అన్నారు. మండలంలోని హరిదాస్‌నగర్, పదిర, రాగట్లపల్లిలో శనివారం జై భీమ్.. జై బాపు, జై సమ్విధాన్ పాదయాత్రకు హాజరై మాట్లాడారు. ప్రజలకిచ్చిన హామీలను అమలు చేస్తున్నట్లు తెలిపారు. గ్రామాల అభివృద్ధికి పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేస్తున్నట్లు చెప్పారు. గ్రామాల్లో రాజీవ్ యువశక్తి పథకాన్ని యువకులు వినియోగించుకునేలా అవగాహన కల్పించాలన్నారు. సన్నబియ్యం పథకంపై గ్రామాల్లో అందరికి పూర్తిస్థాయిలో అవగాహన లేదని, దీనిపై గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు సద్ది లక్ష్మారెడ్డి, నాయకులు ఎస్ కే గౌస్, శ్రీనివాస్, గుల్లపల్లి లక్ష్మారెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, సిరిపురం మహేందర్, నరేందర్, బండారి బాల్‌రెడ్డి, మల్లారెడ్డి, బుచ్చాగౌడ్, బండారి బాల్‌రెడ్డి, అంజిరెడ్డి, రవీందర్, రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

రజతోత్సవ సభకు తరలిరావాలి


ముస్తాబాద్‌లో ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

ముస్తాబాద్: బీఆర్‌ఎస్ రజతోత్సవ సభకు పెద్ద ఎత్తున తరలిరావాలని సెస్ డైరెక్టర్ సందుపట్ల అంజిరెడ్డి అన్నారు. మండలంలోని ఆవునూర్, తుర్కపల్లి, గూడెం గ్రామాల్లో శనివారం బీఆర్‌ఎస్ నాయకులు ప్రచారం నిర్వహించారు. తెలంగాణ సాధించుకున్న పార్టీగా బీఆర్‌ఎస్ చరిత్రలో నిలిచిపోయిందన్నారు. దేశంలోనే అభివృద్ధి రాష్ట్రంగా తీర్చిదిద్దిన ఘనత అధినేత కేసీఆర్‌కు దక్కుతుందన్నారు. సబ్బండ వర్గాలు వరంగల్ మహాసభకు తరలిరావాలని కోరారు. ముస్తాబాద్ మండలం నుంచి 40 బస్సుల్లో వేలాది మందిని వరంగల్‌కు తరలించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు బొంపెల్లి సురేందర్‌రావు, జెడ్పీ మాజీ కో ఆప్షన్ సభ్యుడు సర్వర్, మాజీ సర్పంచ్ నల్లనర్సయ్య, ఎద్దండి నర్సింహారెడ్డి, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

డీసీఆర్బీ డీఎస్పీగా శ్రీనివాసులు

సిరిసిల్లక్రైం: రాష్ట్రంలో డీఎస్పీలను బదిలీ చేస్తూ రాష్ట్ర డీజీపీ జితేందర్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి డీఎస్పీగా పనిచేస్తున్న శ్రీనివాసులను సిరిసిల్ల డీసీఆర్బీ డీఎస్పీగా బదిలీ చేస్తూ ఉత్తర్వులు వెలబడ్డాయి.

సీఎం చిత్రపటం బహూకరణ



బోయినపల్లి: తడగొండ గ్రామపంచాయతీ కార్యాలయానికి సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం చిత్రపటాలను శనివారం కాంగ్రెస్ నాయకులు అందించారు. మార్కెట్ కమిటీ డైరెక్టర్ గుడి రాజశేఖర్‌రెడ్డి, కేశవరెడ్డి, ఉయ్యాల శ్రీనివాస్, ఎండీ.హుస్సేన్, మండల శ్రీనివాస్, నరేశ్, రఫీ, భూమేశ్, వివేక్, నవీన్ తదితరులు ఉన్నారు.

ఫ్లెక్సీలో కనిపించని ప్రభుత్వ విప్ ఫొటో


భూభారతి అవగాహన సదస్సులో ఫ్లెక్సీలో కనిపించని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఫొటో

తంగళ్లపల్లి మండలకేంద్రంలోని శనివారం కలెక్టర్ సందీప్‌కుమార్ ఝూ ఆధ్వర్యంలో అట్టహాసంగా భూభారతి అవగాహన సదస్సు నిర్వహించారు. వేదికపై ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఫొటో లేకపోవడం చర్చనీయాంశమైంది.సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్ ఫొటోలు పెట్టి విప్ ఆది శ్రీనివాస్ ఫొటో పెట్టకపోవడంపై పలువురు కాంగ్రెస్ నాయకులు మండిపడ్డారు. అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

సన్మానం

ఎల్లారెడ్డిపేట: మండల కేంద్రానికి చెందిన మహమ్మద్ రిహాన్ (982), ఒగ్గు శ్రీనిధి (435) ఇంటర్‌లో జిల్లా స్థాయిలో ఉత్తమ ఫలితాలు సాధించగా వారిని బీఆర్‌ఎస్, కాంగ్రెస్ నాయకులు సన్మానించారు. బీఆర్‌ఎస్ మైనార్టీ మండల అధ్యక్షుడు సల్మాన్, కాంగ్రెస్ నాయకులు, తదితరులున్నారు.